క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



మద్దూరు: మండల కేంద్రంలోని ఎండీ మహిమూద్ ట్రేడర్స్‌లో 20క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఈ ట్రేడర్స్‌లో రేషన్‌బియ్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేయగా దాదాపు 20క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించిన తర్వాత ట్రేడర్స్ యజమానిపై కేసునమోదు చేస్తామని ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు. మండలంలో రేషన్‌బియ్యం నిల్వ ఉంచితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మద్దూరు: మండలంలోని భీంపూర్‌శివారులో ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. మండలంలోని పర్సపూర్‌కు చెందిన రాములు, హన్మంతు నారాయణపేట నుంచి మద్దూరు వస్తున్నారు. ఈ క్రమంలోనే మద్దూరు నుంచి అయ్యవారి పల్లికి చెందిన వ్యక్తి బైక్‌పై గ్రామానికి వెళ్తున్న క్రమంలో భీంపూర్ వద్ద ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేట్ వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు లేకపోవడంతో మహబూబ్ నగర్ తీసుకెళ్లాలని అక్కడున్న సిబ్బంది సూచించారు. దీంతో వీరిని అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని ఒకరికి..

మరికల్: బైక్‌పై వెళ్తున్న యువకుడిని కారు ఢీకొని గాయాలైయ్యాయి. మరికల్‌కు చెందిన గొల్ల ఆంజనేయులు గురువారం బైక్‌పైఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం అంబులైన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాగనూర్:మండల పరిధిలోని ఉజ్జెల్లి గ్రామం శివారులో ఓ గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్‌ఐ అబ్దుల్ ఖాదర్ తెలపారు. మృతదేహం చాలా వరకు కుళ్లిపోయి ఉందని, మూడురోజుల క్రితం మృతిచెందినట్లు తెలుస్తుందని స్థానికులు తెలిపారు. అయితే స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు.. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై అనుమానాస్పద మృతదేహంగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిన్నపిల్లల ఆస్పత్రిలో ఎలుకల భయం

నారాయణపేట రూరల్: పట్టణంలోని పాతబస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ చిన్నపిల్లల ఆస్పత్రిలో ఎలుకలు కలకలం రేపుతున్నాయి. గత తొమ్మిది నెలలుగా ఆస్పత్రిలోని గదుల్లో ఎలుకలు తిరుగుతున్నాయని, చిన్నారుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఒక పసిపాప తల్లికి కరిచిందని, ఎన్నో బట్టలను కొరకడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని ఆస్పత్రి నిర్వాహకులను కోరుతున్నారు.

తల్లి మృతితో అనాథలుగా మారిన పిల్లలు



ఊట్కూర్: ఏడాది క్రితం ట్రాక్టర్ బోల్తాపడి తండ్రి మృతిచెందగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ తల్లి మృతిచెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మారిన సంఘటన మండలంలోని నిడుగుర్తిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన తెలుగు నర్సింహులు (32) ఆయన భార్య పద్మ (28) దంపతులు వ్యవసాయంతోపాటు కూలీ పనిచేస్తూ జీవనం గడిపేవారు. వారికి ఒక ఆడపిల్ల, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. గత ఏడాది ఏప్రిల్ 4న రాయిచూర్ పట్టణానికి వెళ్లి ఉల్లిగడ్డలు అమ్ముకొని వచ్చేటప్పుడు లక్ష్మిపల్లిశివారులో ట్రాక్టర్ బోల్తా పడడంతో తీవ్రగాయాలు కావడంతో తండ్రి నర్సింహులు మృతి చెందాడు. కాగా తల్లి పద్మ గత కొంత కాలంగా అనారోగ్యానికి గురైంది. మహబూబ్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందగా బంధువులు గురువారం నిడుగుర్తిలో అంత్యక్రియలు నిర్వహించారు. మౌనిక (10) 3వ తరగతి, తరుణ్ (7) 1వ తరగతి, గణేశ్ (5) అంగన్‌వాడీలో చదువుతు న్నారు. తల్లిదండ్రులు మృతిచెందడంలో ముగ్గురు పిల్లలు అనాథలైయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అనాథ పిల్లలను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి



మరికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

మరికల్: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈమేరకు.. గురువారం మండలంలోని చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి మలేరియా నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీవాణి, హర్షిత, సిబ్బంది అరవింద్, సువర్ణ, వేంకటేశ్వర్, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మాగనూర్: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మండల వైద్యాధికారిణి విరోజ అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడారు.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తూ నిల్వ నీటిని పారబోస్తూ నూతన నీటిని పట్టుకోవాలన్నారు. దోమలతోనే మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని దీంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ దోమల నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు వెంకటేష్‌గౌడ్, అజయ్, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మలేరియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ భవాని అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మలేరియా వ్యాధి నివారణకు ముఖ్యంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటుగా పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయ్‌కుమార్, మణిమాల, సరిత తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: దోమకాటుతో వ్యాపించే మలేరియా వ్యాధిని పూర్తిస్థాయిలో అరికడదామని డాక్టర్ జామిల్ హైమద్ అన్నారు. గురువారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేష్, పార్మసిస్ట్ వెంకట్రామరెడ్డి, ల్యాబ్ టెక్నిషియన్ నాగరాజ్, స్టాఫ్ నర్స్ పుష్పలత, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



దామరగిద్దలో ..



మాగనూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



ఊట్కూర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

కాంగ్రెస్ విజయం కోసం కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. హర్ ఘావ్- ఏక్ గంటే కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపుదిశగా అడుగులు ఏ విధంగా వేయాలనే అంశాలపై ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అనంతరం గ్రామాల పరిధిలోని ప్రధానమైన సమస్యలను గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి, రవికూమార్‌యాదవ్, శివరాంరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: గ్రామీణా వైద్యా సేవకులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మండలంలోని గ్రామీణా వైద్యసేవకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యసేవకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని కోరారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, ఆర్‌ఎంపీఎ సంఘం అధ్యక్షుడు సిద్రామేశ్వర్, రవికుమార్‌యాదవ్, శివరామరాజు, ఆనంద్‌గౌడ్, సూర్యప్రకాష్‌రెడ్డి, ఆనంద్, చక్రధర్, రామకృష్ణా పాల్గొన్నారు.

ఇంటింటా ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోస్గి: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరుతూ గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని పాలమూరు ఎంపీగా గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్నీ వర్గాల ప్రజలు వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఉండి భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ఇద్రీస్, భానునాయక్, మాస్టర్ శ్రీను, బాలేష్, నాయకులు అన్న కిష్టప్ప, నాగులపల్లి శ్రీనివాస్, కోడిగంటి హరి, మ్యాకల రాజేష్, సలీం, టెంట్ నర్సింహ, మజ్జిగ శేఖర్, వేపూర్ వెంకట్రాములు పాల్గొన్నారు.

మరికల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరన్న, నాయకులు కృష్ణయ్య, సూర్యమోహన్ కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మరోసారి ఎంపీ అభ్యర్థికి ప్రజలు ఓట్లువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, హరీష్, రామకృష్ణ, గోపాల్, మొగులప్ప, శేఖర్, రాజు, సత్యన్న పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



మజ్జిగ పంపిణీ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ, మాజీ సర్పంచ్

నారాయణపేట రూరల్: ప్రతీవ్యక్తి తన సంపాదనలో కొంతసామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగించడానికి ముందుకురావాలని మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘువీర్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని 1981–83 ప్రభుత్వ కళాశాల ఇంటర్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేపట్టారు. దామరగిద్ద మాజీ జెడ్పీటీసీ వెంకటమ్మ, మాజీ సర్పంచ్ భీమయ్య దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేయించారు. అనంతరం బాటసారులకు ఉచితంగా మజ్జిగ అందించారు.బీవీఎస్‌రెడ్డి, బీవీరాములు, గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, ఓంప్రకాష్, నారాయణ, మల్లికార్జున్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సేవకుడిగా పనిచేస్తా..



పార్టీలో చేరిన వారితో వంశీచంద్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేవాకిటి శ్రీహరి

నర్వ: తనను గెలిపిస్తే ఐదేళ్ల మీ సేవకుడిగా పనిచేస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు.. నియోజకవర్గ నాయకులు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో బీజేపీ నుంచి పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినవారికి ఢిల్లీలో అధికార ప్రతినిధి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దమ్మున్న సీఎం రేవంత్‌కు ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లు గెలిపించి గిఫ్టుగా ఇచ్చేందుకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుడిలా మూడు వారాలు గ్రామాలు వదలకుండా పనిచేయాలన్నారు. పాలమూరు పార్లమెంట్ సెగ్మెంట్‌లో మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల తోనే వంశీచంద్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. అనంతరం ఉందేకోడ్, పెద్దకడ్మూర్, ఆత్మకూర్, అమరచింత మండలాలు, గ్రామాల నుంచి భారీగా కార్యకర్తలు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, కిరణ్‌ప్రకాష్ రెడ్డి, చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, నీరజ్, వివేక్‌వర్ధన్ రెడ్డి, శరణప్ప పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిబిరం



కోస్గి: గుండుమాల్ మండల పరిధిలోని బోగారం జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిబిరం విజయవంతంగా కొనసాగుతుంది. ఈ మేరకు గురువారం గ్రామ ఎంపీటీసీ రవికుమార్ శిక్షణ శిబిరానికి ఓ వలంటీర్‌ను నియమించడంతోపాటు విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో విద్యార్థులకు డ్రాయింగ్, డ్యాన్స్, కళలు, గణిత మేళకువలు నేర్పించనున్నట్లు పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా మునిరంగస్వామి యజ్ఞం



మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నంలో మునిరంగస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల సందర్భంగా గురువారం ఆలయ ఆవరణలో యజ్ఞం, హోమాలు నిర్వహించారు. శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విగ్రహ ప్రతిష్ఠాపనను జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మంచి ఫలితాలను సాధించాలి



మరికల్: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ధారించుకుని మంచిఫలితాలను సాధించేందుకు అవకాశం ఉందని భారతి ఉన్నతపాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంతోష్ అన్నారు. గురువారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశను తీర్చేలా తమ చదువులు ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకున్నారు.

మాలల అభ్యున్నతికి కృషి

అమరచింత: పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో గురువారం మాల వీధిలో మాల జనసంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా వెంకట్రాములు, ఉపాధ్యక్షులుగా రాములు, విష్ణువర్ధన్, సహాయ కార్యదర్శులుగా నరేష్, శేఖర్, భార్గవ్, కోశాధికారిగా రామస్వామితో పాటు మరో 11 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ మాలల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

చిరుధాన్యాల సాగుతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నారాయణపేట: మండలంలోని జాజాపూర్ రైతు వేదికలో యూత్ ఫర్ యాక్షన్, కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై రైతులు, శాస్త్రవేత్తల చర్చ గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త త్రయంబక్ ఖోగారే, సస్యరక్షణ విభాగం రాజేంద్రకుమార్, డీఏఓ జాన్ సుధాకర్ మాట్లాడారు. జిల్లాల్లో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే జొన్న పంట విస్తీర్ణం తగ్గి వరి వైపు మొగ్గు చూపిస్తున్నారని, జొన్న సాగును పెంపొందించాలన్నారు. రైతుల మరణాలు గమనించినట్లయితే చాలామంది గుండె, క్యాన్సర్ వంటి రోగాలతో అత్యధికంగా మరణిస్తున్నారన్నారు. మంచి ఆహార ఉత్పత్తులు పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు సాగే రైతుకు సమాజానికి మేలు చేస్తుందన్నారు. జొన్న, రాగులకు వ్యవసాయ మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉందన్నారు. జిల్లాకు అనుకూలమైన మహారాష్ట్ర జొన్న వెరైటీలను సాగు చేసి 18 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జి భవాని, అనిలా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం



నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

నారాయణపేట రూరల్: సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం వార్షిక పరీక్షలు ప్రారంభమైయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ టెన్త్‌కోసం 593మంది, ఓపెన్ ఇంటర్‌కు 856మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో తొలిరోజు పరీక్షకు డీవీఎం, గర్ల్స్ స్కూల్, గ్రౌండ్ పాఠశాలల్లో పదోతరగతికి 505మంది హాజరై 88గైర్హాజరు కాగా 85.16హాజరుశాతం నమోదైంది. అదేవిధంగా శ్రీసాయి కళాశాల, కృష్ణవేణి, శ్రీనారాయణ, బ్రిలియంట్, శ్రీసాయి స్కూల్ కేంద్రాల్లో ఇంటర్ పరీక్షకు 734మంది హాజరై 122మంది గైర్హాజరు కాగా 85.74హాజరుశాతం నమోదైంది. మధ్యాహ్నం జరిగిన పరీక్షకుగాను శ్రీసాయి పరీక్షకేంద్రంలో ముగ్గురు, శ్రీనారాయణ సెంటర్‌లో ఇద్దరిని కేటాయించగా ఐదుగురు హాజరు కావడంతో వందశాతం హాజరు నమోదైంది. పరీక్ష కేంద్రాలను డీఈఓ ఎండీ అబ్దుల్‌ఘనీ, ఫ్లయింగ్ స్క్వాడ్ రమేష్‌శెట్టి బృందం, జిల్లా కో- ఆర్డినేటర్ శ్రీనివాసులు పరిశీలించారు.

చెక్కు అందజేత

నారాయణపేట రూరల్: పట్టణంలోని సిటిజన్‌క్లబ్ ఆవరణలో ప్రతీరోజు పతాంజలి యోగా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగాశిబిరానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు రామకృష్ణ తన సొంత డబ్బులతో మైక్‌సెట్ అందిస్తానని తెలిపారు. ఈ మేరకు తన తల్లిదండ్రుల చేతుల మీదుగా గురువారం రూ.25వేలను కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సురేష్, రాజేంద్ర, సుదర్శన్, వెంకటేష్, బాలప్ప, మల్లికార్జున్, విజయలక్ష్మి పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న దాతలు

ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంటుందని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌ఓలు, సెక్టార్ ఆఫీసర్స్, వార్డ్ ఆఫీసర్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ప్రతి ఓటరుకు సమాచారమందించాలని, సీ వీజిల్ పత్రాలు అందజేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ విధానంపై అవగాహన కలిగించే నిమిత్తం ఇంటింటికీ ఓటర్ గైడ్స్ పత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. కొత్తగా ముద్రించిన ఐడిన ఓటరు గుర్తింపు కార్డులను బీఎల్‌లు స్వయంగా ఓటర్లకు అందించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలతోపాటు అధికారులు పాల్గొన్నారు.

లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక



లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

నారాయణపేట: జిల్లాలోని మక్తల్, నారాయణపేటలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి గురువారం జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఎం.ఏ రషీద్ సమక్షంలో నారాయణపేటలోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ బాలురలో ఎస్సీ ఎస్టీ బీసీ ఓసి కేటగిరీ విద్యార్థులకు లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. 127 దరఖాస్తులు రాగా 20 మంది విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎల్‌సీ అధికారి ఖవాజా బహావుద్దీన్ మాట్లాడుతూ లాటరీ పద్ధతిలో ఎంపికైన విద్యార్థులు మే 2వ తేదీ వరకు తమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సంబంధిత పత్రాలను అనుసంధానం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖవాజా మెహబూబ్ ఖాన్, మక్తల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్వేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్రకు తరలి రావాలి

నారాయణపేట: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపుకోసం శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాలో చేపట్టనున్న గులాబీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు బస్సు యాత్రకు జిల్లా నుంచి గులాబీ దండు పెద్దఎత్తున తరలిరావాలని బీఆర్‌ఎస్ చీఫ్, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిక..

కోస్గి: స్థానిక బీఆర్‌ఎస్ నేతలు పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరగా గురువారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మీర్జాపూర్ హన్మంత్‌రెడ్డితోపాటు పలువురు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో మీర్జాపూర్ మాజీ సర్పంచ్ వీరేందర్ రెడ్డి, బొల్వోన్‌పల్లి మాజీ సర్పంచ్ కొండారెడ్డి, ముశ్రీఫా మాజీ సర్పంచ్ వెంకట్రాములు, పోలేపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, కడంపల్లి ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి, బిజ్జారం ఎంపీటీసీ బాల్‌రాజ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, నాయకులు అన్న కిష్టప్ప, గిరిప్రసాద్‌రెడ్డి, ముకుందారెడ్డి, గురునాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



ప్రచారం చేస్తున్న నాయకులు

ధన్వాడ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటువేసి దేశాభివృద్ధికి తోడ్పాటునివ్వాలని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మండల అధ్యక్షుడు మకం సురేందర్ అన్నారు. గురువారం మండలంలోని బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్, రాంచంద్రయ్య, గోవింద్, నారాయణ, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.